# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 08-03-2016**

తెలంగాణ – మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి చారిత్రక ఒప్పందం కుదిరింది. ముంబైలోని సహ్యాద్రి అతిథి గృహంలో మంగళవారం ఉదయం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు, శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ సంతకాలు చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, మంత్రులు ఇంద్ర కరణ్ రెడ్డి, జోగు రామన్న, ప్రభుత్వ సలహాదారులు డి.శ్రీనివాస్, ఆర్. విద్యాసాగర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.కె. జోషి, సిఎం అదనపు కార్యదర్శి స్మితా సభర్వాల్, ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి గిరిష్ మహాజన్, మహారాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి సతీష్ ఎం గవాయ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య గతంలో జరిగిన అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల ఒప్పందాలను, భవిష్యత్తులో నిర్మించే ప్రాజెక్టులను పరిశీలించడానికి అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేసుకోవడానికి పరస్పర అంగీకారంతో ఒప్పందం కుదిరింది. గోదావరి నదీ జలాల వివాద ట్రిబ్యునల్ 1979 (తదుపరి నివేదిక 1980) పరిశీలనకు అనుగుణంగా రెండు రాష్ట్రాల మధ్య అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల నిర్మాణాలన్నింటికి ఈ బోర్డు సర్వ పర్యవేక్షణ సంస్థగా పనిచేస్తుంది.

1. లెండి ప్రాజెక్టు
2. ప్రాణహిత ప్రాజెక్టు (తమ్మిడిహట్టి బ్యారేజి), కాళేశ్వరం ప్రాజెక్టు (మేడిగడ్డ బ్యారేజి)
3. పెన్ గంగపై రాజుపేట వద్ద బ్యారేజి
4. పెన్ గంగపై చనాఖా-కొరాట మధ్య బ్యారేజి

5. పెన్ గంగపై పంపరాడ్ వద్ద బ్యారేజి

6. లోయర్ పెన్ గంగ ప్రాజెక్టు

పై ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాలను బోర్డు పర్యవేక్షిస్తుంది. ఏవైనా సందేహాలు, అనుమానాలు, సమస్యలున్నా ఈ బోర్డు సామరస్యంగా పరిష్కరిస్తుంది. మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య గతంలో జరిగిన ఒప్పందాలను కూడా ఈ బోర్డు పరిగణలోకి తీసుకుంటుంది.

బోర్డుకు ఒక ఏడాది తెలంగాణ ముఖ్యమంత్రి, మరుసటి ఏడాది మహారాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మన్ గా ఉంటారు. ఒక ముఖ్యమంత్రి చైర్మన్ గా ఉన్న కాలంలో మరో ముఖ్యమంత్రి కో చైర్మన్ గా వ్యవహరిస్తారు. రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖల మంత్రులు, రెండు రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులు, రెండు రాష్ట్రాల రెవెన్యూశాఖ మంత్రులు, రెండు రాష్ట్రాల అటవీశాఖ మంత్రులు, కేంద్ర జలవనరుల శాఖ ప్రతినిధి, రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శులు, ఆర్థిక శాఖ కార్యదర్శులు, రెవెన్యూ శాఖ కార్యదర్శులు, అటవీశాఖ కార్యదర్శులు, మహారాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఇడి, తెలంగాణ నీటి పారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, రెండు రాష్ట్రాల సిసిఎఫ్ లు సభ్యులుగా ఉంటారు. బోర్డు ప్రధాన కార్యాలయం హైదరాబాద్ లో ఉంటుంది. హైదరాబాద్ లో గానీ, ముంబైలో గానీ బోర్డు సమావేశాలు జరుగుతాయి.

చరిత్రలో మహత్తరమైన అధ్యాయం: ముఖ్యమంత్రి కేసీఆర్

తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి ఒప్పందం కుదరడం రెండు రాష్ట్రాల చరిత్రలో ఓ మహత్తరమైన అధ్యాయమని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. రాష్ట్రాలు వేరైనా అందరం మొదట భారతీయులమేనని, ఇరుగు పొరుగు రాష్ట్రాలతో ఘర్షణ పూరిత వాతావరణంలో కాకుండా సామరస్య పూర్వకంగా సమస్యలు పరిష్కరించుకుంటామని సిఎం స్పష్టం చేశారు. మహారాష్ట్రతో ప్రాజెక్టుల ఒప్పందంపై సంతకాలు చేసిన అనంతరం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ముంబైలో మీడియా, రెండు రాష్ట్రాల అధికార యంత్రాంగాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

“మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్ గారికి కృతజ్ఞతలు. ఏడాది క్రితం నేను మహారాష్ట్రకు వచ్చాను. సుదీర్ఘకాలం పోరాటం తర్వాత తెలంగాణ సాధించుకున్నాం. తెలంగాణ ప్రజలకు అనేక ఆకాంక్షలున్నాయి. నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసం పోరాటాలు చేసినం. సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తో ఘర్షణాత్మక వైఖరితో ఉండాలని అనుకోవడం లేదు. ఇదే విషయం నేను ఫడణవీస్ తో చెప్పాను. వారు కూడా సానుకూలంగా స్పందించారు. భగవంతుడి దయవల్ల గోదావరిలో చాలా నీళ్లున్నాయి. రెండు నుంచి నాలుగువేల టిఎంసిల నీళ్లు సముద్రంలో వృథాగా పోతున్నాయి. ఇదే విషయాన్ని ఎపి సిఎంకు కూడా చెప్పాను. గోదావరి నీళ్లను మహారాష్ట్ర ఉపయోగించుకన్న తర్వాత మేము ఉపయోగించుకుంటాం. మా తర్వాత ఆంధ్రప్రదేశ్ వాడుకుంటుంది. మహారాష్ట్రతో తెలంగాణకు చాలా పొడవైన సరిహద్దున్నది. వారితో సామరస్యపూర్వక సంబంధాలు కోరుకుంటున్నాం. మనం అనుకుంటున్న ప్రాజెక్టుల వల్ల రెండు రాష్ట్రాలకు మేలు కలుగుతుంది. ప్రజలు కూడా ఆ ప్రాజెక్టుల విషయంలో అనుకూలంగా ఉన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో ఓట్లు వేయించుకున్నారు తప్ప కట్టలేదు. కానీ ఇప్పుడు ప్రాజెక్టులు నిజరూపం దాలుస్తున్నాయి. తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో మీరు చెప్పినట్లే నడుచుకుంటాం. మేడిగడ్డ ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ వ్యాప్కోస్ నిర్వహించిన సర్వే నివేదికను మహారాష్ట్రకు అందించాం. అక్కడ బ్యారేజి ద్వారా నిల్వ ఉండే నీరును మీరు(మహారాష్ట్ర) కూడా వాడుకోవచ్చు. గడ్చిరోలి లాంటి వెనుకబడిన జిల్లాలకు తరలించవచ్చు. ఈ విషయంలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. వీలైనంత త్వరలో బోర్డు మీటింగ్ పెట్టుకుందాం. ఇప్పుడున్న నీటిని కూడా వృథాగా పోనివ్వకుండా సమ్మర్ సీజన్ కు ఉపయోగపడే చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం మీరు అనుమతిస్తే వెంటనే పని మొదలు పెడతాం. మీరు మమ్మల్ని పిలిచి సమస్యకు పరిష్కారం చూపేందుకు దారి చూపెట్టారు. ఈ ప్రాజెక్టుల వల్ల మా బతుకులు బాగుపడతాయని ప్రజలు అనుకుంటున్నారు. తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం తరుఫున కృతజ్ఞతలు. నీటి విషయంలోనే కాకుండా ఇతర అన్ని అంశాల్లో కలిసి నడుద్దాం. నీటి కోసం చాలా రాష్ట్రాల మధ్య యుద్ధం నడుస్తున్నది. కానీ మనం మాత్రం సామరస్యంగా ముందుకుపోదాం. చర్చలు స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగాయి. చాలా సంతోషం. మహారాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులను హైదరాబాద్ రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నా. హైదరాబాద్ ఫేమస్ బిర్యానీ తినిపిస్తాం. మీరు రావడం మా అదృష్టం” అని కేసీఆర్ అన్నారు.

రెండు రాష్ట్రాల అభివృద్ధికి కీలకం: ఫడ్నవీస్

అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల నిర్మాణం జరగడం రెండు రాష్ట్రాల అభివృద్ధికి కీలకమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అన్నారు. దేశాల మధ్యే నీటి పంపకాలు జరుగుతున్న నేపథ్యంలో ఒకే దేశంలోని రెండు రాష్ట్రాల మధ్య సామరాస్యపూర్వకంగా సమస్యలు పరిష్కరించుకోవడం ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. ఈ ఆలోచన నుంచే తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చాయని చెప్పారు.

“కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంతో మహారాష్ట్ర ప్రభుత్వం అంతర్రాష్ట్ర ఒప్పందాలు కుదుర్చుకున్నది. ఏడాది క్రితం తెలంగాణ సిఎం చంద్రశేఖర్ రావు మహారాష్ట్రకు వచ్చినప్పుడు అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో చర్చ జరిగింది. మహారాష్ట్రను మిత్రరాష్ట్రంగా చూస్తున్నామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు మహారాష్ట్రతో వివాదాలు ఉండేవి, తెలంగాణ రాష్ట్రం అలా ఉండదని స్పష్టం చేశారు. మనం ఒక దేశానికి చెందిన రాష్ట్రాలం. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ జరగాలి. ఈ విధంగా ఆలోచించి రెండు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు పోతున్నాం” అని మహారాష్ట్ర సిఎం అన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**